క్లుప్తంగా

ఎంపీడీవో కార్యాలయంలో అధ్వానంగా మరుగుదొడ్డి



విజయపురం : స్థానిక ఎంపీడీవో కార్యాయలంలో మరుగుదొడ్డి అధ్వానంగా ఉండి దుర్గంధం వెదజల్లుతుండడంతో వివిధ పనుల కోసం అక్కడికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్డిని శుభ్రం చేస్తున్నారా.. లేదా అని ప్రశ్నిస్తున్నారు. మరుగుదొడ్డి అధ్వానంగా ఉండడంతో అధికారులు అత్యవసర పరిస్థితుల్లో కార్యాలయం వెనుక వైపు ఉన్న బహిరంగ ప్రదేశానికి వెళుతున్నట్టు సమాచారం. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పైపులైన్‌కు మరమ్మతులు



మహావీరాపురంలో పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్న సిబ్బంది

విజయపురం : మండలంలో మహావీరాపురం పంచాయతీలో తాగునీటి పైపులైన్‌కు అధికారులు మరమ్మతులు చేపట్టి నీటి లీకేజీని అరికట్టారు. కొన్ని రోజుల క్రితం పైపులైన్ దెబ్బతిని నీరు వృథాగా పోతోంది. దీనిపై గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేయడంతో స్పందించిన ఈవోపీఆర్డీ బాబు పైపులైన్ మరమ్మతులు చేపట్టి లీకేజీని అరికట్టారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

పుత్తూరు: అఖిలభారత బీమా ఉద్యోగుల సంఘం (ఏఐఐఈఏ) ఆవిర్భావ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుత్తూరులో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. స్విమ్స్ బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి శ్రీధర్‌బాబు వైద్య బృందం సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 61 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో బ్రాంచి మేనేజర్ హేమాద్రి, యూనియన్ నాయకులు దస్తగిరి, లక్ష్మణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

10వ తేదీ వరకు డిగ్రీ ప్రవేశాలకు దరఖాస్తులు

కార్వేటినగరం: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు శుక్రవారం నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైందని, ఈ నెల 10వ తేదీ వరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి తెలిపారు. కళాశాలలో బీఎస్సీ, బీకాం, బీఏ కోర్సుల్లో చేరేందుకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. 5 నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన, 11 నుంచి 15వ తేదీ వరకు ఆప్షన్ల ఎంపిక చేసుకోవచ్చని తెలిపారు. అలాగే 19వ తేదీ సీట్లు కేటాయిస్తారని, 20 నుంచి 22 తేదీల్లోగా కళాశాలలో రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. స్పెషల్ కేటగిరి అభ్యర్థులకు విజయవాడలోని ఎస్ఆర్ఆర్ కళాశాల, విశాఖలోని వీఎస్ క్రిష్ణ, తిరుపతిలో ఎస్వీయూ వర్సిటీల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేస్తారన్నారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత సాధించి డిగ్రీ కళాశాలలో చేరాలనుకున్న విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ద్రౌపదీ దేవికి ప్రత్యేక పూజలు



వెదురుకుప్పం: మండలంలోని చవటగుంట ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి భక్తి ప్రపత్తులతో పాలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టు పీతాంబరాలతో అలంకరించారు. విశేష పూజలనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలు పంచిపెట్టారు.

50 పడకల ఆస్పత్రి నిర్మాణం వేగవంతం

కార్వేటినగరం: నిర్మాణంలో ఉన్న 50 పడకల ఆస్పత్రి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్మాణం జరుగుతున్న 50 పడకల ఆస్పత్రి పనులను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్వేటినగరానికి తలమానికంగా నిర్మిస్తున్న 50 పడకల ఆస్పత్రిని ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. నియోజకవర్గం పర్యటనకు వచ్చే ప్రతి సారి కార్వేటినగరం సీహెచ్‌ఎస్‌ని సందర్శిస్తానని, వైద్యులు విధులకు డుమ్మా కొడితే ఊరుకోబోమని హెచ్చరించారు.

జామలో తెగుళ్ల నివారణే ముఖ్యం



శ్రీకావేరిరాజుపురంలో సాగులో ఉన్న జామ తోట (ఇన్‌సెట్) ఏవో ఢిల్లీప్రసాద్

పాలసముద్రం: మండల పరిధిలో రైతులు జామ తోటలను విస్తారంగా సాగు చేస్తున్నారు. శ్రీకావేరి రాజుపురం, ఆముదాల, బాలక్రిష్ణాపురం, తిరుమలరాజుపురం, వనదుర్గాపురం, వెంగళ్రాజుకుప్పం గ్రామాల్లో విరివిగా రైతులు జామ సాగు చేస్తున్నారు. జామ తోటలు పూత, పిందె, కాత దశల్లో ఉండగా పక్వానికి వచ్చిన కాయలు కుళ్లిపోతున్నాయి. వివిధ రకాల తెగుళ్లు ఆశించాయి. వీటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏఓ ఢిల్లీప్రసాద్ ఇలా వివరించారు.

కాయకుళ్లు తెగులు నివారణ

ఈ తెగులు సోకిన జామ తోటల్లో చెట్లపై నుంచి కింద వరకు కొమ్మలు, రెమ్మలు ఎండి పోతాయి. పండ్లపై గుండ్రటి గోధుమ రంగు మచ్చలు గుంతలుగా ఏర్పడి రెండు, మూడు రోజుల్లో పండ్లు కుళ్లి రాలిపోతాయి. దీనిని అరికట్టేందుకు రైతులు ఎండిన రెమ్మలకు, కొమ్మలను వెంటనే కత్తిరించాలి. అలాగే కుళ్లిన పండ్లను తోట నుంచి తొలగించాలి. తెగులు నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ మూడు గ్రాముల లీటరు నీటిలో కలిపి కాయలు తయారయ్యే సమయంలో 10 నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేయాలి. ఎండు తెగులు ఆశించిన జామ తోటల్లో పురుగు వేరును ఆశిస్తుంది. దీంతో వేరుపై తెగులు ఆశించిన కొద్ది కాలంలో చెట్టుపై భాగం నుంచి కింద వరకు ఎండిపోతుంది. సాధారణంగా చౌడు రకం, భూసారం లేని భూముల్లో జామ సాగు చేపడితే ఈ తెగులు ఎక్కవగా వ్యాపిస్తుంది. దీని నివారణకు ఒక్కో మొక్కకు కిలో చొప్పున సున్నం లేదా జిప్సమ్, పచ్చిరొట్ట ఎరువు లేదా పశువుల ఎరువును ఎక్కువ వేయాలి. మొదళ్ల భాగంలో గ్రాము కార్బండిజమ్ లీటర్ నీటిలో కలిపి తడపాలి. 14 రోజుల తరువాత ఎండుటాకులను గుంతలో వేసి కాల్చేయాలి.

పండు ఈగ తెగులు నివారణ

జామ తోటల్లో దిగుబడి తగ్గడానికి ప్రధాన కారణం పండు తెగులు ఆశించడం. కాయలు పక్వానికి రాగానే పండు ఈగ ఉధృతి ఎక్కవగా ఉంటుంది. దీని నివారణకు రెండు మిల్లీ లీటర్ల మిథైల్ ఇథనాల్, మూడు గ్రాములు కార్బోప్యూరాన్ త్రీజీ గుళికలను లీటర్ నీటిలో కలిపి ద్రావణాన్ని తయారు చేయాలి. ఒక్కో ప్లాస్టిక్ పళ్లెంలో 200 మిల్లీ లీటర్లు ద్రావణాన్ని పోయాలి. తోటలో అక్కడక్కడా చెట్టు కొమ్మలకు వేలాడదీయాలి. మగ ఈగలు ఆకర్షణకు గురై ద్రావణంలో పడి చనిపోతాయి. రెండు మిల్లీ లీటర్ల మలాథియాన్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తోటలో పండు ఈగ ఆశించి కింద పడిన కాయలను ఏరివేసి నాశనం చేయాలి.



బూడిద తెగులు సోకిన జామ ఆకు, తోటలో కాసిన జాయ కాయ

తెల్లదోమ నివారణ

తెల్లదోమ ఆకులపై చేరి రసాన్ని పీలుస్తాయి. ఆకులు ఎర్రబడి ముడతలు పడతాయి. వీటి నివారణకు జిగురు పూసిన పసుపు రంగు డబ్బాలను రాత్రి వేళల్లో తెల్లదోమ ఆశించిన చెట్ల వద్ద ఉంచాలి. వేప నూనె 0.5 మిల్లీ లీటర్లను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పిండినల్లి నివారణ

ఈ రకం తెగులు ఆశించిన జామ తోటల్లో కొమ్మల చివర కాయలను పిండి నల్లి ఆశించి కాయల్లో రసాన్ని పీలుస్తాయి. దీంతో కాయలు, ఆకులు రాలి పోతాయి. ఇవి జిగురు పదార్థాన్ని విసర్జించడంతో మసి తెగులు వస్తోంది. తెగులు నివారణకు అక్షింతలు పురుగు బదనికలను తోటలో విడుదల చేయాలి. ఎసిఫేట్ గ్రాము లేదా డైక్లోరోఫాస్ ఒక మిల్లీ లీటరు, లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి,

రోడ్డు ఆక్రమణను తొలగించండి



తహసీల్దారు సుభద్రకు వినతి పత్రం సమర్పిస్తున్న గంధపాడివారిపల్లె గ్రామస్తులు

పెనుమూరు(కార్వేటినగరం): గ్రామంలోని రోడ్డుకు ఇరుపక్కలా ఉన్న ఆక్రమణలు తక్షణమే తొలగించాలని పెనుమూరు మండలం చిప్పారపల్లె పంచాయతీ గంధపాడివారిపల్లె గ్రామస్తులు శుక్రవారం తహశీల్దారు సుభద్రకు వినతిపత్రం సమర్పించారు. ఈ విషయమై పెనుమూరు ఎస్ఐ లోకేష్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా గంధపాడివారిపల్లె గ్రామస్తులు మాట్లాడుతూ నెల క్రితం తమ రోడ్డు ఆక్రమణ జరిగిందని తహశీల్దారు సుభద్రకు ఫిర్యాదు చేశామన్నారు. ఆమె గ్రామస్తులు, పోలీసుల సమక్షంలో రోడ్డు సర్వే చేసి, ఇరుపక్కలా సరిహద్దు రాళ్లు నాటించారన్నారు. అయితే అధికారులు నాటిన రాళ్లు రాత్రికి రాత్రే తొలగించారని తెలిపారు. గాంధీపురం–గంధపాడివారిపల్లె రోడ్డు ఆక్రమణతో గ్రామానికి పాఠశాల బస్సులు, పాల వ్యాన్‌లు రావడం లేదని తెలిపారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అక్రమంగా రోడ్డుపై వ్యవసాయ బోరు, పశువుల పాకలు ఏర్పాటు చేయడంతో గ్రామస్తులంతా ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. రోడ్డు ఆక్రమణ తొలగించకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెరుం త్యాగరాజులు, నగిరిపల్లె రాజగోపాల్, ఎం.ప్రకాష్, డి.రమేష్, ఎస్.సుశీల, జి.శాంతి, ఎం.సావిత్రి, ఎస్.జ్యోతి, ఎం.లోకేష్, ఎస్.జయ చంద్ర, ఎస్.వాసు, దేవరాజులు, డి.రాణి, ఎస్.విజయ, ఎస్.వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కుంభాభిషేక పూజలు



ఆలయం వద్ద ప్రతిష్ఠకు సిద్ధం చేసిన విగ్రహాలు

నగరి : మున్సిపాలిటీ పరిధిలోని పుదుపేట నాగాలమ్మ ఆలయంలో శనివారం నుంచి కుంభాభిషేక పూజలు ప్రారంభం కానున్నాయి. రెండు రోజుల పాటు కుంభాభిషేక పూజలను వేడుకగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం ఆలయం వద్ద ఏర్పాట్లు ఊపందుకున్నాయి. ఆలయంలో నూతనంగా ప్రతిష్ఠించే దేవతా మూర్తుల విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం హోమ, వాస్తు పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠ చేస్తామని, ఆదివారం మహా కుంభాభిషేకం, మహా అభిషేకం, ఉత్సవమూర్తుల ఊరేగింపు ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

భర్త మృతిపై పోలీసులకు ఫిర్యాదు

తడ: తన భర్త మృతిపై అనుమానం ఉందని, విచారణ చేసి న్యాయం చేయాలని శ్రీకాళహస్తికి చెందిన పామల శ్యామల శుక్రవారం తడ పోలీసులను కోరింది. ఎస్ఐ నరసింహారావు కథనం మేరకు.. చిత్తూరు జిల్లా కార్వేటినగరం మండలం కోటచెరువు గ్రామానికి చెందిన పామల మధుబాబు(40) కుటుంబ వివాదాల కారణంగా రెండేళ్ల క్రితం తడ మండలం అక్కంపేట గ్రామానికి వచ్చి తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అక్కంపేటలోనే ఇల్లు అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. మధుబాబు అప్పుడప్పుడూ పెద్దగా కేకలు వేస్తుంటాడని, గురువారం రాత్రి కూడా కేకలు వేశాడని, తర్వాత సైలెంట్ అయ్యాడని స్థానికులు తెలిపారు. అక్కడికి వెళ్లి చూడగా అతను అపస్మారక స్థితిలో కిందపడి ఉండడంతో 108 ద్వారా సూళ్లూరుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అతను అప్పటికే మృతి చెందినట్టు ధ్రువీకరించారు. దీంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుని వద్ద లభించిన ఆధారాల ఆధారంగా పోలీసులు మృతుని భార్యకు సమాచారం ఇచ్చారు. అక్కడికి వచ్చిన మృతుని భార్య, కుటుంబ సభ్యులు మధుబాబు మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చంద్రప్రభపై పరాశరేశ్వరస్వామి విహారం



నారాయణవనం: టీటీడీ అనుబంధ చంపకవల్లీ సమేత పరాశరేశ్వరస్వామి శుక్రవారం సాయంత్రం చంద్రపభ వాహనాన్ని అధిరోహించి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ఉదయం ఆలయాన్ని తెరచిన అర్చకులు నిత్యపూజా కార్యక్రమాలను పూర్తి చేశారు. ఉత్సవర్లు తిరుచ్చి వాహనంలో ధ్వజస్తంభం వద్ద కొలువుదీరాయి. ధ్వజస్తంభానికి అభిషేకాలను నిర్వహించిన అర్చకులు నందీశ్వరుని చిత్రపటమున్న వస్త్రాన్ని అధిరోహింపచేయడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. 10 గంటలకు ఉత్సవర్లను స్నపన తిరుమంజనం నిర్వహించి ధూప, దీప నైవేద్యాలను సమర్పించారు. సాయంత్రం కైంకర్యాలను అందుకున్న ఉత్సవర్లు చంద్రపభ వాహనాన్ని అధిష్ఠించారు. సర్కారు హారతి అందుకున్న దేవరులు పురవీధుల్లో విహరిస్తూ భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. ఉత్సవాల్లో రెండో రోజు శనివారం సాయంత్రం సింహ వాహనం అధిష్ఠించి ఊరేగింపులో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

నేటి నుంచి వారాహి నవరాత్రులు

నాగలాపురం: మండలంలోని సురుటుపల్లి గ్రామంలో వెలసిన సర్వ మంగళ సమేత శ్రీ పళ్లికొండేశ్వర స్వామి ఆలయంలో 6వ తేదీ నుంచి 15వ తేదీ వ రకు వారాహి నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కార్య నిర్వాహణ అధికారి కె.రామచంద్రా రెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు నిర్వహిస్తామన్నారు. ప్రతి రోజు సాయంత్రం 6 గంటలకు నిర్వహించే అభిషేకంలో పాల్గొనదలచిన వారు రూ.300 చెల్లించి రసీదు పొందాలని కోరారు.

కుక్కలకు ఉచిత వ్యాక్సిన్

నారాయణవనం: పెంపుడు కుక్కల కాటుతో రేబీస్ వ్యాధి సోకకుండా ఉచిత నిరోధక టీకాలను వేయడానికి ఏర్పాట్లు చేసినట్లు పశువైద్యాధికారులు భార్గవి, కుమార్ తెలిపారు. ప్రపంచ జునోసిస్ దినోత్స వాన్ని పురస్కరించుకుని శనివారం పెంపుడు కుక్కలకు టీకాలను నారాయణవనంలోని పశు వైద్యశాలలో వేయించుకోవాలని వారు కోరారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేస్తున్న ఎంఈవో

నగరి : మండలంలోని ఎం.కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను శుక్రవారం మండల విద్యాశాఖాధికారి బి.నమశ్శివాయం తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరును, మధ్యాహ్నం భోజనాన్ని ఎంతమంది తింటున్నారు తదితర విషయాలపై ఆరా తీశారు. బియ్యం, గుడ్లు, చిక్కి పెడుతున్నారా, లేదా? అని అడిగి తెలుసుకున్నారు. టేస్ట్ రిజిస్టర్, స్టాక్ రిజిస్టర్లు, వంటగదిని పరిశీలించారు. మధ్యాహ్న రిజిస్టర్స్ అప్‌డేట్‌లో లేదని, ప్రతిరోజూ లెక్కలను నమోదు చేయాలని ఆదేశించారు. మధ్యాహ్న భోజనం తినే పిల్లల సంఖ్య పెంచాలని ప్రధానోపాధ్యాయులు గీతాకుమారికి సూచించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెట్టాలి



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంపీడీఓ రామనాథరెడ్డి

పాలసముద్రం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని నాణ్యంగా పెట్టాలని ఎంపీడీఓ రామనాథరెడ్డి, ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. శుక్రవారం పాలసముద్రం ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు చేసిన మధ్యాహ్న భోజనం నాణ్యతను వారు పరిశీలించారు. ప్రస్తుతం వాతావరణం మార్పులతో వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. కూరగాయలు, బియ్యాన్ని ఒకటికి రెండు సార్లు మంచి నీటితో శుభ్రంగా కడిగి సాంబార్, అన్నం చేయాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు చేసిన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, హెచ్ఎం మీనాక్షి, టీచర్ దొరరాజ్, మధ్యాహ్న భోజన నిర్వాహకులు పాల్గొన్నారు.

ఆగమోక్తంగా అమావాస్య ఉత్సవం



ఊరేగుతున్న స్వామి, అమ్మవార్లు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం అమావాస్య ఉత్సవాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామికి పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను చప్పరాలపై అధిష్ఠింపజేసి పురవిహారం చేశారు. భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేటుతో తప్పని తిప్పలు

ఏకాంబరకుప్పం వద్ద ఉన్న రైల్వే క్రాసింగ్ గేటు వైపు సాయంత్రం సమయంలో వెళ్లాలంటే వాహనదారులు జంకుతున్నారు. పోనీ ధైర్యం చేసి వెళ్లారా.. ఇక అంతే సంగతులు. ట్రాఫిక్‌లో ఇరుక్కుపోయి అవస్థలు పడాల్సిందే. ప్రభుత్వ శాఖల మధ్య ఏర్పడిన సమన్వయ లోపంతోనే ట్రాఫిక్ సమస్య కొలిక్కి రావడం లేదని తెలిసినా ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదు. – నగరి



రైల్వే గేటు వద్ద నెలకొన్న ట్రాఫిక్

- ఏకాంబరకుప్పం రైల్వేగేట్ వద్ద స్తంభిస్తున్న ట్రాఫిక్
- ఇబ్బందికరంగా ఉన్న అండర్ బ్రిడ్జి
- అధికారులు పరిశీలిస్తున్నా ఫలితం శూన్యం

నగరి నుంచి చిత్తూరుకు వెళ్లే రోడ్డులోని ఏకాంబరకుప్పం వద్ద అప్పర్, లోయర్ ట్రాక్‌లు ఉన్నాయి. అప్పర్ ట్రాక్‌పై ట్రైన్లు వెళ్లినా ట్రాఫిక్ సమస్య ఉండదు. లోయర్ ట్రాక్‌లో వెళ్లే రైళ్లు వెళ్లిన సమయంలో గేట్లు పడడంతో ట్రాఫిక్ స్తంభిస్తోంది. ప్రతి రోజూ లోయర్ ట్రాక్‌లో 7 ఎక్స్‌ప్రెస్, 7 గూడ్స్, 4 యూనిట్ ట్రైన్లు వెళుతుంటాయి. దీంతో పలుమార్లు గేటువేయాల్సి వస్తోంది. ఈ మార్గంలోనే చిత్తూరుతో పాటు పళ్లిపట్టు, సత్రవాడ, కేవీపీ ఆర్‌పేట, తెరణి, మిట్టపాళెం తదితర గ్రామాలకు వెళ్లాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఉదయం, సాయంత్రం విద్యార్థులు, ఉద్యోగులు అధికంగా ఈ మార్గం గుండా ప్రయాణిస్తూ ఉంటారు. దీంతో రైల్వే గేట్ వద్ద మితిమీరిన ట్రాఫిక్ ఏర్పడుతోంది. ప్రత్యామ్నాయంగా వాడుకోవడానికి మరో మార్గం లేకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అండర్ బ్రిడ్జి ఉన్నా పూర్తిగా మట్టి పేరుకుపోవడం, వర్షపు నీటితో బురదగా ఉండడంతో అటువైపు వెళ్లేందుకు ప్రయాణికులు సాహసించలేకపోతున్నారు. ఈ సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా రెండు ట్రాకులలో ఒక ట్రాక్‌లోనే కదా ట్రాఫిక్ సమస్య అదేం అంత పెద్దది కాదులే అంటూ కొట్టిపారేస్తున్నారు. ఓవర్ బ్రిడ్జి ఏర్పాటుకు పరిశీలన చేసి వెళ్లిన రైల్వే అధికారులు సైతం ఆ అంశాన్ని కాగితాలకే పరిమితం చేశారు. రైల్వే గేటుతో తంటా తీరేదెప్పుడంటూ అంటూ ప్రయాణికులు మదనపడుతున్నారు. రైల్వే అధికారులు సమస్యపై ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి



ఘనజీవామృతం తయారీని వివరిస్తున్న ఫరీద్ మస్తాన్, రిసోర్స్ పర్సన్ పుష్ప

పాలసముద్రం: ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని ఐకేపీ ఏపీఎం ఫరీద్ మస్తాన్, నగరి డివిజన్ ప్రాజెక్టు రిసోర్స్ పర్సన్ పుష్ప తెలిపారు. శుక్రవారం క్రిష్ణజమ్మపురం యూనిట్‌లో గ్రామ సంఘ అధ్యక్షురాలు కోశాధికారి మునియమ్మ, కవిత, లత ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించి, ప్రతిజ్ఞ చేశారు. మాస్టర్ ట్రైనర్ ప్రతాప్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో చెరకు సాగు చేయవచ్చునని తెలిపారు. అందులో నుంచి వచ్చే బెల్లం టీటీడీ తీసుకోవడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. సంఘ సభ్యులు కిచెన్ గార్డెన్ విధానాన్ని వివరించారు. వరిపంటను ఆశించే చిన్నచిన్న తెగుళ్ల నివారణకు పేడ, ఇంగువతో చేసిన ద్రావణం వినియోగించాలని, ఘనజీవామృతం తయారీపై అవగాహన కల్పించారు.

ఇది చెరువు కాదు రహదారే..



మడుగును తలపిస్తున్న దేవళంపేట రోడ్డు

వెదురుకుప్పం: ఇది చెరువు అనుకున్నారో పప్పులో కాలేసినట్టే... చిన్నపాటి వర్షానికే ప్రధాన రహదారి ఇలా దర్శనమిస్తోంది. మండలంలోని దేవళంపేటలో ప్రధాన రహదారిపై వర్షపు నీరు చేరడంతో చెరువును తలపిస్తోంది. శుక్రవారం కురిసిన వర్షానికి మండలంలోని దేవళంపేట ఇండియన్ బ్యాంక్ ఎదురుగా ప్రధాన రహదారిపై ఇలా వర్షపు నీరు నిలవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ చినుకుపడితే చాలు రోడ్డుపైకి నీళ్లు చేరి నీటి గుంటలా తయారవుతోంది. రోడ్డు మడుగును తలపించడంతో పాదచారులు, స్థానికులు సైతం అడుగు పెట్టలేని పరిస్థితి తలెత్తుతోంది. ప్రధాన రహదారికి ఇరువైపులా భవనాలు నిర్మించడంతో వృథా నీరు ప్రవహించేందుకు కాలువలు లేక ఇలా నిలిచిపోతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సమస్యను పరిష్కరించాలని అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వృథా నీరు ప్రవహించేందుకు కాలువ నిర్మాణం చేపట్టి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కదిలిన ప్రభుత్వ యంత్రాంగం



నీవా నదీ పరివాహక ప్రాంతంలో వ్యర్థాలను తొలగిస్తున్న అధికారులు, సిబ్బంది



చికెన్ దుకాణాల యజమానులకు నోటీసులు ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి అంజాద్ బాషా

గంగాధర నెల్లూరు: నీవా నదిలో భారీ ఎత్తున చికెన్ వ్యర్థాలను పారబోయడంతో ఆ ప్రాంతం మొత్తం దుర్గంధ భరితంగా మారింది. దీనిపై శుక్రవారం సాక్షి దినపత్రికలో కథనం రావడంతో ప్రభుత్వ యంత్రాంగం ఎట్టకేలకు స్పందించింది. జేసీబీని ఏర్పాటు చేసి చికెన్ వ్యర్థాల తొలగింపు పని చేపట్టారు. జీడీనెల్లూరు సర్పంచ్ సుబ్రహ్మణ్యం యాదవ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ మండల విస్తరణాధికారి రాఘవేంద్ర రాజు, పంచాయతీ కార్యదర్శి అంజాద్ బాషా ఉదయం నుండి సాయంత్రం వరకు దగ్గర ఉండి మరి నీవా నదీ పరివాహక ప్రాంతాన్ని జేసీబీ సహాయంతో చికెన్ వ్యర్థాలను, ఫ్యాక్టరీ వ్యర్థాలను తొలగించారు. దహన సంస్కారాలు చేసుకోవడానికి కూడా త్వరలోనే పరిష్కారం చేపడుతామని తెలిపారు. అనంతరం గంగాధరనెల్లూరు మండల కేంద్రంలోని చికెన్ దుకాణాల యజమానులకు నోటీసులు అందజేశారు. చికెన్ వ్యర్థాలను నీవా నదిలో పడవేయకూడదని, ఒకవేళ నిబంధనలను అతిక్రమిస్తే భారీ జరిమానాలతో దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

డ్రాపౌట్.. బడి బాట!



బడిలో చేరుతున్న మనస్విని

చిత్తూరు కలెక్టరేట్: బడి మానేసిన విద్యార్థినిని తిరిగి బడికి పంపించేలా సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. శుక్రవారం ఆయన జిల్లాలోని పలు మండలాల్లో పర్యటించారు. బంగారుపాళ్యం మండలం తుంపాయనపల్లెలో ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఆ తనిఖీలో ఒకటవ తరగతి చదివే మనస్వి చాలా రోజులుగా పాఠశాలకు రావడం లేదని తెలుసుకున్నారు. ఆ విద్యార్థిని వివరాలు తెలుసుకున్న ఆయన తిన్నగా ఆ బాలిక ఇంటి వద్దకు వెళ్లారు. మనస్వి చదువు మాన్పించిన తల్లిదండ్రులకు అవగాహన కల్పించి, తిరిగి బడికి పంపించేలా చర్యలు తీసుకున్నారు.

కారు ఢీకొని ఇద్దరికి తీవ్రగాయాలు

గుడిపాల: కారు ఢీకొని ఇద్దరు వ్యక్తులకు తీవ్రగాయాలైనట్లు ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. చిత్తూరు నుంచి తమిళనాడు లోని కాట్పాడి సమీపంలోని లత్తేరికి చెందిన ఇద్దరు వ్యక్తులు శుక్రవారం రాత్రి ద్విచక్ర వాహనంపై వస్తుండగా శుక్రవారం రాత్రి వారిని కారు ఢీకొని వెళ్లిపోయింది. స్థానికులు వెంటనే గుడిపాల పోలీసులకు సమాచారం అందించారు. వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి పోలీసు వాహనంలోనే తరలించారు. ప్రస్తుతం వారి పరిస్థితి విషమంగా ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.